క్లుప్తంగా

వేపకంపల్లి ఎంపీటీసీగా కనకదుర్గ

కారెంపూడి: మండలంలోని వేపకంపల్లి ఎంపీటీసీగా బొల్నేడి కనకదుర్గ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి, ఏఆర్ఓ శ్రీనివాసరెడ్డి మంగళవారం తెలిపారు. మొత్తం రెండు నామినేషన్లు దాఖలు అయ్యాయి. ఇద్దరూ టీడీపీ అభ్యర్థులే వేయగా వారిలో బొల్నేడి హైమావతి మంగళవారం నామినేషన్‌ను విత్‌డ్రా చేసుకున్నారు. దీంతో పోటీలో బొల్నేడి కనకదుర్గ ఒక్కరే మిగిలారని అధికారులు ప్రకటించారు. పోటీలో ప్రత్యర్థులు లేకపోవడంతో కనకదుర్గను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. గతంలో వైఎస్సార్ సీపీకి చెందిన కోకా అక్కమ్మ, వేపకంపల్లి ఎంపీటీసీగా కారెంపూడి వైస్ ఎంపీపీగా కొనసాగుతూ మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అధికారులు ఉప ఎన్నిక నిర్వహించారు.

మన మిత్ర, పుర మిత్రను సద్వినియోగం చేసుకోండి



మాచర్ల: వాట్సాప్‌లో మన మిత్ర- పురమిత్రను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు కోరారు. పురపాలక సంఘ అధికారులు, ఉద్యోగులు, మెప్మా ప్రాజెక్టు, సచివాలయ ఉద్యోగులు, డ్వాక్రా ఆర్పీల ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలో ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఇంట్లోనే ఉండి ప్రభుత్వ సేవలు పొందేందుకు మన మిత్ర పుర మిత్ర యాప్‌ను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. పింఛన్, రేషన్‌కార్డు, హెల్త్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవటం, ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి సేవలు పొందేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ర్యాలీలో ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. పట్టణంలో 1500ల మందికి అవగాహన కల్పించారు.

ప్రత్యేక అలంకరణలో కనకదుర్గ అమ్మవారు



పిడుగురాళ్ల: పట్టణంలోని భవానీ నగర్‌లోని కనకదుర్గ అమ్మవారిని శ్రావణ మాసం సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఎరువుల దుకాణం తనిఖీ



మాచర్ల: రైతులు ఆరుగాలం శ్రమించినా సరైన పంట చేతికి రాకపోవటం, పంట నష్టపోవటం వంటివి జరగటం చాలా బాధాకరమని తహసీల్దార్ బి.కిరణ్ కుమార్, వ్యవసాయ విస్తరణాధికారి ఎం.మార్కండేయులు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని మార్కెఫెడ్ ఆగ్రో సర్వీస్ సెంటర్ ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఎరువులు, పురుగులమందుల, విత్తన దుకాణదారులు రైతులు కొనుగోలు చేసిన వస్తువులకు తప్పనిసరిగా బిల్లులు చెల్లించాలని కోరారు. రైతులు వాటిని పంట మొత్తం పూర్తయ్యే వరకు తమ వద్ద ఉంచాలని చెప్పారు.

పిడుగురాళ్లలో వర్షం



పిడుగురాళ్ల: రెండు రోజులుగా తీవ్రమైన ఎండతో ఉక్కపోతతో విలవిలాడుతున్న ప్రజలకు మంగళవారం కురిసిన వర్షం ఉపశమనం కలిగించింది. ఉదయం నుంచి ఎండ తీవ్రంగా కాసి మధ్యాహ్నం 3 గంటల సమయంలో అరగంటపాటు భారీ వర్షం పడటంతో అందరు ఆనందం వ్యక్తం చేశారు. అంతేకాకుండా పంటలు వేసిన రైతులకు కూడా ఈ వర్షం ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మాలమహాసభ కన్వీనర్‌గా రాజు

పిడుగురాళ్ల: మాలమహాసభ కన్వీనర్‌గా పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన జి.రాజు నియమితులైనట్లు మాలమహా సభ ప్రెసిడెంట్ వెంకట్రావు నుంచి నియామక పత్రం అందినట్లు రాజు మంగళవారం తెలిపారు. మాలమహాసభ ద్వారా అందరికి న్యాయబద్ధంగా ఉండి పోరాటం చేస్తానని పేర్కొన్నారు.

విద్యుత్ భారాలను విరమించుకోవాలి

- వామపక్షాల డిమాండ్
- విద్యుత్ సబ్‌స్టేషన్ ముట్టడి



విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఎల్ఐ శ్రీనివాసరావుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న వామపక్షాల నాయకులు

రెంటచింతల: కరెంట్ బిల్లులలో మోపుతున్న ట్రూ ఆప్ చార్జీల భారాలను, స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని వెంటనే విరమించుకోవాలని కోరుతూ మంగళవారం స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌ను వామపక్షాలు ముట్టడించాయి. సీపీఐ మండల కార్యదర్శి కేతావత్ రంగనాయకులు మాట్లాడుతూ సద్దుబాటు చార్జీల పేరుతో కూటమి ప్రభుత్వం కరెంట్ బిల్లులలో ట్రూ ఆప్ చార్జీల భారాలను పేదలపై మోపుతుందని విమర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటుచేసిన స్మార్ట్ మీటర్లు పగలగొట్టాలని పిలుపునిచ్చిన కూటమి ప్రభుత్వం కూడా అదే దారిలో నడుస్తూ బడా కంపెనీలకు దోచిపెడుతున్నారని మండిపడ్డారు. సీపీఎం మండల కార్యదర్శి తిక్కా నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యుత్ సంస్కరణల పేరుతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సర్‌చార్జీలు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో పేదలపై పెనుభారం మోపుతాన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం వినతి పత్రాన్ని ఎల్ఐ శ్రీనివాసరావుకు అందజేశారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకులు రాంబాబు, కార్మిక సంఘాల నాయకులు మామిడి సామ్యేలు, బిట్టు మరియదాసు, పాలకుర్తి సత్యయ్య, కె.సోమయ్య, అమరారపు శామ్యూల్ జాను పాల్గొన్నారు.

మా ఇంటికి స్మార్ మీటర్ వద్దంటూ ధర్నా

పిడుగురాళ్ల: మా ఇంటికి స్మార్ట్ మీటర్ బిగించవద్దంటూ పట్టణంలోని గాంధీనగరన్ వార్డు సచివాలయం, కొండమోడు కరెంట్ ఆఫీసు వద్ద వామపక్షాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. నరేంద్రమోదీ ప్రభుత్వం విద్యుత్‌ను అదానీ కంపెనీకి అప్పజెప్పడం అంటే కార్పొరేటర్లకు దోసిపెట్టడమేనని విమర్శించారు. దీనిలో భాగంగానే అదానీ కంపెనీ స్మార్ట్ మీటర్లు బిగించే విధానాన్ని మొదలుపెట్టిందని, తొలిగా రైతులు దీన్ని వ్యతిరేకిస్తే ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ నాయకుడు నారా లోకేష్ వాటిని పగలగొట్టండి అని పిలుపునిచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. నేడు చాప కింద నీరులా స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నారని, ప్రజలు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే సర్‌చార్జీలు, కస్టమ్ చార్జీలు, ట్రూ ఆఫ్ చార్జిలతో 15 వేల కోట్ల రూపాయలు భారం పడుతుందని, మూలిగే నక్కపై తాటికాయ పడినట్లుగా ఈ స్మార్ట్ మీటర్ల వలన మీటర్ ఖరీదు పదివేల నుంచి 17 వేల వరకు భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని మానుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధర్నాలో సీఐటీయూ నాయకులు తెలకపల్లి శ్రీనివాసరావు, బత్తుల వెంకటేశ్వర్లు, దీకొండ వెంకటేశ్వర్లు, షేక్ బాబు, ఎస్ సంపత్ కృష్ణ, వెంకయ్య, ఏఐఎఫ్‌టియూ న్యూ నాయకులు కొండారెడ్డి చెన్నయ్య, అనిల్‌కుమార్, ఆంజనేయులు, కొండలు, గౌస్, జాన్‌బి, ఏఐటీయూసీ నాయకులు అక్కినపల్లి బాలయ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పిడుగురాళ్ల గాంధీనగర్ సచివాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వామపక్షాలు

తల్లిపాలే బిడ్డకు అమృతం



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ రత్నకుమారి



కంభంపాడులో మాట్లాడుతున్న సీడీపీఓ కృష్ణవేణి

గురజాల: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వై.రత్నకుమారి సూచించారు. నగర పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు తాగించాలన్నారు.

తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటిది

మాచర్ల రూరల్: పుట్టిన బిడ్డకు తల్లిపాలు అందించటం వలన ఆ బిడ్డ మానసికంగా దృఢంగా తయారు కావటమే కాకుండా, తల్లికి ఆరోగ్యానికి ఎంతో చేయూతనందిస్తుందని సీడీపీఓ కృష్ణవేణి తెలిపారు. మంగళవారం మండలంలోని కంభంపాడు గ్రామంలో తల్లిపాల వారోత్సం నిర్వహించారు. తల్లిపాలు బిడ్డకు ఒక వరం లాంటిదని, తల్లిపాలు ఇవ్వటం సర్వైకల్ క్యాన్సర్ నుంచి తప్పించుకునే అవకాశముందని, తల్లీబిడ్డల మధ్య అనుబంధం ఏర్పడటంతో పాటు తెలివితేటలు ఎక్కువగా ఉంటాయన్నారు. తల్లి ముర్రుపాలు మొదటి టీకాలాగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అన్నపూర్ణ, అంగన్‌వాడీ టీచర్లు అనూష, మల్లేశ్వరి, ఇందిరా, తిరుపతమ్మ, సురేఖ, స్వప్న పాల్గొన్నారు.

సూపర్‌వైజర్ రత్నకుమారి

రైతులు మంచి దిగుబడులు సాధించాలి

గురజాల రూరల్: రైతులు మండల వ్యవసాయాధికారుల సలహాలు తీసుకుని మంచి దిగుబడి సాధించాలని డీడీఏ శివకుమారి సూచించారు. నగర పంచాయతీ పరిధిలోని జంగమహేశ్వరపురంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వ్యవసాయ సిబ్బంది సలహాలు తీసుకుని ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పలు వరి పంటలను పరిశీలించారు. అనంతరం రైతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పుల్లారెడ్డి, సైంటిస్టు సైదా నాయక్ పాల్గొన్నారు.



వరి పంట పొలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఎన్‌సీసీతో ఉజ్వల భవిష్యత్

- ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ గోపాల్ త్రిపాఠి
- ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు బి సర్టిఫికెట్లు అందచేత



కేబీఆర్ కళాశాలలో క్యాడెట్స్‌తో ఎన్‌సీసీ బెటాలియన్ అధికారులు

నరసరావుపేట ఈస్ట్: విద్యార్థులలో మానసిక, శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ అలవరుచుకునేందుకు ఎన్‌సీసీ దోహద పడుతుందని 23 ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ గోపాల్ త్రిపాఠి తెలిపారు. కాసు బ్రహ్మానందరెడ్డి కళాశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్స్ బి సర్టిఫికెట్ పరీక్ష ఉత్తీర్ణులైన సందర్భంగా మంగళవారం కళాశాలలో క్యాడెట్స్‌కు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న కల్నల్ గోపాల్ త్రిపాఠి మాట్లాడుతూ, ఎన్‌సీసీలో చేరిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని స్పష్టం చేసారు. విద్యా, ఉద్యోగాలలో ప్రత్యేక రిజర్వేషన్ కల్పిస్తున్నట్టు తెలిపారు. కాగా, కళాశాలకు చెందిన 28 మంది క్యాడెట్స్ పరీక్షకు హాజరు కాగా అందరూ ఉత్తీర్ణులైనట్టు కళాశాల ప్రిన్సిపల్ సి.హెచ్.వి. నాగిరెడ్డి, ఎన్‌సీసీ ఆఫీసర్ మేజర్ వై.అంజిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ బెటాలియన్ ఏఓ లెఫ్టినెంట్ కల్నల్ పరమార్, కళాశాల పాలకవర్గ ప్రతినిధి కె.వి.పురుషోత్తమ రావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎ.వెంకటశివ తదితరులు పాల్గొన్నారు. బి.సర్టిఫికెట్ సాధించిన విద్యార్థులను కళాశాల కార్యదర్శి, గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అభినందించారు. అలాగే శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాలకు చెందిన 28 మంది విద్యార్థులు బి.సర్టిఫికెట్ పరీక్షకు హాజరు కాగా అందరూ ఉత్తీర్ణులైనట్టు ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్, ఎన్‌సీసీ ఆఫీసర్ మేజర్ బిఎస్ఆర్‌కె రాజు తెలిపారు. విద్యార్థులకు బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ గోపాల్ త్రిపాఠి సర్టిఫికెట్లు అందచేశారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

నరసరావుపేటటౌన్: కుమార్తె అదృశ్యంపై తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ ఎం.వి. చరణ్ మంగళవారం తెలిపారు. ప్రకాష్‌నగర్‌కు చెందిన పి. శారదకు చంద్రబాబునాయుడు కాలనీకు చెందిన ఆంజనేయులుతో వివాహం అయ్యింది. ఇద్దరి మధ్య మనస్పర్థలు రావటంతో పెద్దల సమక్షంలో మాట్లాడుకొని విడిగా ఉంటున్నారు. శారద తండ్రి శ్రీను వద్ద ఉంటుంది. సోమవారం ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. ఆమె కోసం వెతికినా ఫలితం దక్కలేదు. ఈ మేరకు యువతి తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఉమ్మడివరం వైఎస్సార్ సీపీ రథసారథిగా ఆచార్యులు



వినుకొండ: మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆదేశాల మేరకు మండలంలోని ఉమ్మడివరం గ్రామంలో వైఎస్సార్ సీపీ కమిటీని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దండు చెన్నయ్య ఆధ్వర్యంలో ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ పార్టీ ప్రెసిడెంట్‌గా కాయకోకుల ఆచారులు (ముసలయ్య)ను ఏకగ్రీవంగా ఎన్నుకొని నియామకపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పగడాల వెంకట్రామిరెడ్డి, జడ్పీటీసీ సూరాబత్తిని రాజేశ్వరరావు, మండల స్థాయి నాయకులు, గ్రామనాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగ పోటీలకు ఎంపిక



నరసరావుపేట రూరల్: రాష్ట్రస్థాయి యోగాసన పోటీలకు తిరుమల ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వైవి నారాయణ మంగళవారం తెలిపారు. యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నరసరావుపేటలోని సరస్వతి శిశు మందిర్‌లో నిర్వహించిన యోగ పోటీలో కళాశాల విదార్థిని పి. ఏసుమరియమ్మ ఉత్తమ ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానం కై వసం చేసుకున్నట్టు తెలిపారు. ఈనెల 21వ తేదీన తాడేపల్లిగూడెంలో నిర్వహించే రాష్ట్రస్థాయి యోగాసన పోటీలలో ఏసుమరియమ్మ పాల్గొంటారని వివరించారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబర్చిన ఏసుమరియమ్మను ప్రిన్సిపల్ డాక్టర్ వైవి నారాయణ, యోగ అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.రంగలక్ష్మీ, అధ్యాపకులు అభినందించారు.

ఆన్‌కాల్ డ్రైవర్ల ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోండి

వినుకొండ: స్థానిక ఏపీఎస్ ఆర్టీసీ డిపోలో ఆన్ కాల్ డ్రైవర్లుగా పనిచేసేందుకు దరఖాస్తులు చేసుకోవాలని డిపో మేనేజర్ జి.నాగేశ్వరరావు తెలిపారు. 8వ తరగతి చదివి హెవీ వెహికల్ లైసెన్స్ కలిగి ఏడాది గడిచి ఉండాలని కోరారు. సంస్థ నిబంధన ప్రకారం డ్రైవింగ్ చేసిన ఎడల వారికి ప్రతి దినము రూ.800లు జీతం ఇవ్వడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 9959225431 నంబరును సంప్రదించాలన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

చిలకలూరిపేట: లోక్‌అదాలత్ ను సద్వినియోగం చేసుకొని సత్వర న్యాయం పొందాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ కె నరేంద్రరెడ్డి తెలిపారు. న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 13వ తేదీన జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి రోజూ కోర్టులో ప్రీ లోక్‌అదాలత్ సిట్టింగ్స్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

డిప్యూటీ డీఈవో పర్యటన

నాదెండ్ల: కనపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను నరసరావుపేట డిప్యూటీ డీఈవో షేక్ మహబూబ్‌సుభాని ఆకస్మిక తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. ఉపాధ్యాయులతో సమావేశమై గతేడాది పదో తరగతి పరీక్షా ఫలితాలను విశ్లేషించారు. ఆయనతో పాటూ హెచ్ఎం, ఉపాధ్యాయులు ఉన్నారు. మధ్యాహ్న భోజనం పథకాన్ని పరిశీలించారు.

ఉపాధి హామీ సిబ్బందికి ఒకరోజు శిక్షణ



క్రోసూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం అమరావతి, పెదకూరపాడు, అచ్చంపేట, క్రోసూరు, బెల్లంకొండ మండలాల మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం సిబ్బందికి ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు ఏపీవో బి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో జియో ట్యాగింగ్, జియో ఫెన్సింగ్ మొబైల్ యాప్ వినియోగంపై శిక్షణనిచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీడీవో జి.రవికుమార్ ప్రారంభించగా డిపార్ట్‌మెంట్ విజిలెన్స్ ఆఫీసర్ (ఫైనాన్స్ మేనేజర్) హీరాలాల్, సత్తెనపల్లి ఇన్‌చార్జి ఏపీడీ పి.వెంకటనారాయణ సారధ్యం వహించారు. ఈ కార్యక్రమంలో జేఈ రమణమూర్తి, ఈసీ హరిత, టీఏలు , చిరంజీవి, డీఆర్పీలు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయాలి

ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగాధర్‌బాబు



కొప్పునూరు జెడ్పీ పాఠశాలలో మాట్లాడుతున్న గంగాధర్‌బాబు

మాచర్ల రూరల్: కూటమి ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు దాటుతున్నా ఉపాధ్యాయులకు అందిస్తామన్న పీఆర్సీ, ఐఆర్‌ను, డీఎలను, వెంటనే ప్రకటించాలని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.గంగాధర్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని కొప్పునూరు, వీపీ సౌత్, ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ సంఘ నాయకులతో ఆయన మాట్లాడారు. ఎన్నికలలో ఇచ్చిన హామీల మేరకు మాచర్ల, రెంటచింతల, వెల్దుర్తి, దుర్గి మండలాలలో ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. బదిలీలు కోరుకొని రిలీవ్ కాకుండా ఆగిపోయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని చెప్పారు. ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించటం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఏరియా కార్యదర్శి టి.రాజశేఖర్ మాట్లాడుతూ ఎఫ్ఏ 1 పరీక్షలలో మూల్యాంఖనం చేసిన ప్రశ్నపత్రాలను ఆన్‌లైన్‌లో స్కాన్ చేయాలనటం ఉపాధ్యాయులకు ఇబ్బందికరమైన పరిణామమని, ఆ విధానాన్ని వెంటనే తొలగించాలని, అధిక సంఖ్యలో విద్యార్థులున్న పాఠశాలలో ఆన్‌లైన్ వలన బోధనానికి తీవ్ర అంతరాయం కలుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ కన్వీనర్ అబ్దుల్ జబ్బార్, ప్రధాన కార్యదర్శి బొమ్ము నాగరాజు, ఆర్థిక కార్యదర్శి అబ్దుల్ రహమాన్, మల్లికార్జునరావు, రాజు, సిలార్ అహ్మద్ పాల్గొన్నారు.

అమ్మవార్లకు కుంకుమ పూజలు



అన్నపూర్ణేశ్వరి అమ్మవారి దేవాలయంలో మంగళగౌరీ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మహిళలు



లక్ష గాజులతో అన్నపూర్ణేశ్వరి అమ్మవారికి అలంకరణ

మాచర్ల: శ్రావణమాస పూజలు భక్తులు భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. పట్టణంలోని పత్తి ఫ్యాక్టరీ ప్రాంతం సాయిబాబా మందిరంలో అమ్మవారిని మంగళగౌరీగా అలంకరించారు. కుంకుమ పూజ నిర్వహించారు. పాత మాచర్లలోని వాసవి కన్యక పరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అధ్యక్షులు భవనాశి వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రెటరీ తిరివీధి వెంకట నాగేశ్వరరావు పూజా కార్యక్రమాలు పర్యవేక్షించారు. పట్టణంలోని సొసైటీ కాలనీలో అన్నపూర్ణ, గాయత్రీదేవి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నగరేశ్వర స్వామి దేవాలయంలో అర్చకులు వంశీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని చంద్రవంక బ్రిడ్జి ప్రాంతంలో ఆదిలక్ష్మి అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించి అర్చకులు, ధర్మకర్త ఆధ్వర్యంలో కుంకుమ పూజలు చేశారు. పాతవూరులోని యాదవ బజారులో చౌడమ్మ దేవాలయంలో ప్రత్యేకంగా అమ్మవారిని అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. యాదవ సంఘం పెద్దల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి ఆలయంలో మంగళగౌరీ పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

చేనేత దినోత్సవం ఘనంగా నిర్వహించుకోవాలి



మాట్లాడుతున్న చిల్లపల్లి సత్యం

పెదకూరపాడు: దేశ స్వాతంత్ర్యోద్యమంలో ప్రధాన భూమిక పోషించి, స్వాతంత్ర్య సముపార్జనకు ఒక సాధనంగా నిలిచింది చేనేత అని, ఈ నెల 7న ప్రతి ఒక్కరూ 11వ జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించుకోవాలని జాతీయ చేనేత ఐక్య వేదిక సంఘం పల్నాడు అధ్యక్షుడు చిల్లపల్లి సత్యం అన్నారు. స్థానిక చేనేత సంఘం కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమంలో అహింసాయుత ఉద్యమానికి నాంది పలికిన చేనేత రంగానికి ఒక రోజు ఉండాలన్న ఉద్దేశంతో జాతీయ చేనేత దినోత్సవం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. తొలిసారిగా 1905 ఆగస్టు 7న బాలగంగాధర్ తిలక్, గోపాలకృష్ణ గోఖలే, లాలాలజపతిరాయ్ విదేశీ వస్త్రాలను బహిష్కరించడంతోపాటు దేశీయోత్పత్తుల పునరుద్ధరణకు పిలుపునిచ్చారని గుర్తు చేశారు. విదేశీ వస్త్ర బహిష్కరణలో కీలకపాత్ర వహించిన ఆగస్టు 7ను జాతీయ చేనేత దినోత్సవంగా జరుపుకోవడం అభినందనీయమన్నారు. 2015 ఆగస్టు 7న చెన్నైలో ప్రధాని మోదీ చేనేత లోగోను ఆవిష్కరించి, ఆగస్టు 7ను జాతీయ చేనేత దినోత్సవంగా పరిగణిస్తున్నట్లు ప్రకటించారన్నారు. కావున ప్రతి ఒక్కరు చేనేత దినోత్సవం ఘనంగా జరుపుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

లైబ్రరీ నిర్మాణానికి స్థలం కేటాయించాలి

సత్తెనపల్లి: మండలంలోని లక్కరాజుగార్లపాడు గ్రామంలో సర్వేనెంబర్ 114లోని బావి పోరంబోకు స్థలంలోని 0.06 సెంట్ల భూమిని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరుతో లైబ్రరీ, మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్‌ల విగ్రహాల ఏర్పాటుకు, ఆ స్థలం కేటాయించాలని గ్రామస్తుడు జొన్నలగడ్డ వెంకట్రావు, ఎస్సీ కాలనీ వాసులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నాయకులు, ఎస్సీ కాలనీవాసులు సత్తెనపల్లి ఆర్డీవో జీవీ రమనాకాంతరెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జొన్నలగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్యాలయ పరిధిలో మాజీ సర్పంచ్ కొండవీటి కృష్ణారావు, మహాత్మాగాంధీ, సుభాష్ చంద్ర బోస్, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి, ఎన్టీ రామారావు, మాజీ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహాలు ఉన్నాయని, అదే స్ఫూర్తితో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరు మీద లైబ్రరీ, మహాత్ముల విగ్రహాల నిర్మాణం కోసం పోరంబాకు స్థలంలోని 0.06 సెంట్ల భూమిని కేటాయించాలన్నారు. ఇప్పటికే ఈ స్థలం పై విచారణ జరిపి పూర్తి విచారణ నివేదికను, సంబంధిత స్టేట్‌మెంట్లు, క్షేత్రస్థాయి విచారణ ఫోటోలు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కి, మండల సర్వేయర్, గ్రామ రెవెన్యూ అధికారి అందించడం జరిగిందన్నారు. తాము దశాబ్దాలుగా నడుస్తున్న దారిని ప్రస్తుత అధికార పార్టీకి చెందిన వ్యక్తులు మట్టితోవి దారికి అడ్డంగా వేశారన్నారు. దీనిపై తహసీల్దార్‌కు అర్జీ దాఖలు చేయగా వీఆర్వో, ఆర్ఐ విచారణ చేసి ఎండార్స్‌మెంట్ కూడా ఇచ్చారన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీస్ నాయకులు, గ్రామంలోని ఎస్సీ కాలనీ వాసులు ఉన్నారు.

ప్రకృతి సాగుతో ఖర్చు తక్కువ.. ఆదాయం ఎక్కువ

ప్రకృతి వ్యవసాయ శిక్షణ పల్నాడు జిల్లా అడిషనల్ ప్రాజెక్టు మేనేజర్ ప్రేమరాజు

నకరికల్లు: పంటలకు రసాయనాలు వాడడం ద్వారా భూమి ఆరోగ్యం దెబ్బతింటుందని ప్రకృతి వ్యవసాయ శిక్షణ పల్నాడు జిల్లా అడిషనల్ ప్రాజెక్టు మేనేజర్ ప్రేమరాజు అన్నారు. నకరికల్లు, కారంపూడి మండలాల వీఏఏ, వీహెచ్ఏ, వ్యవసాయ సిబ్బందికి ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక రైతు సేవ కేంద్రంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలను సాగుచేసే రైతులకు ప్రకృతి వ్యవసాయ, వ్యవసాయ శాఖ అధికారుల భాగస్వామ్యం అవసరమన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగులో ఖర్చు తగ్గి ఆదాయం పెరుగుతుందని, అలాగే భూమిలో నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం, పంట నాణ్యత, తెగుళ్లను తట్టుకునే సామర్థ్యం పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఏవో కె.దేవదాసు, మాస్టర్ ట్రైనర్ బాజిబాబు, సుబ్బారెడ్డి, మోడల్ మేకర్ హసీనా, యూనిట్ ఇన్‌చార్జిలు రామసుబ్బారెడ్డి, జ్యోతి, రమేష్, వీఏఏలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.